క్లుప్తంగా

వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న శ్రీనివాస్

జగిత్యాలరూరల్: వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం పరిశీలించి మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలకు సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో స్వాతి, మమత, లావణ్య, ఆశావర్కర్లు రజిత, భార్గవి, నవిత, నవ్య, జమున పాల్గొన్నారు.

పచ్చదనం, పరిశుభ్రతపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో శంకర్

కథలాపూర్: గ్రామాల్లో పచ్చదనం,పరిశుభ్రతపై ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు దృష్టిసారించాలని ఎంపీడీవో శంకర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక స్థలాల్లో మొక్కలు నాటాలన్నారు. వర్షాకాలంలో గ్రామాల్లో మురికి నీరు నిల్వలు లేకుండా చూడాలన్నారు. పంచాయతీ సిబ్బందితో ఎప్పటిప్పుడు శుభ్రం చేయించాలన్నారు. సమావేశంలో ఎంపీవో ప్రవీణ్, ఏపీవో రాజేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీలో అడ్మిషన్ల పెంపునకు సహకరించాలి



ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉపన్యాసకులు

మెట్‌పల్లి: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల పెంపునకు సహకరించాలని ఉపన్యాసకులు మంగళవారం స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావును కలిసి కోరారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణులైన విద్యార్థులు డిగ్రీ కళాశాలలో చేరేలా చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెంకయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు అందించి ఆదుకోవాలి



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

జగిత్యాల: రైతులకు సకాలంలో జీలుగ, పచ్చిరొట్ట విత్తనాలు అందించి ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలకృష్ణ అన్నారు. పట్టణంలో సంఘం కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. తొలకరి జల్లులు ప్రారంభమయ్యాయని, రైతులకు అడుగు మందు, కల్తీలేని జీలుగ, పచ్చిరొట్ట జనుము విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. కల్తీ విత్తనాలు అమ్మే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, చంద్రయ్య, వెంకటచారి తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్‌లో కాంగ్రెస్‌కు ఆధిక్యం

సారంగాపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మండలంలో 2,145 ఓట్ల ఆధిక్యం వచ్చింది. కాంగ్రెస్ పార్టీకి 7478 ఓట్లు పోలవ్వగా, బీజేపీకి 5,333 ఓట్లు, బీఆర్ఎస్‌కు 1661 ఓట్లు వచ్చాయి. సారంగాపూర్‌లో 458 ఓట్లు కాంగ్రెస్ పార్టీకి బీజేపీ కంటే ఎక్కువ వచ్చాయి. పోతారంలో 5 ఓట్లు, రేచపల్లి 475 ఓట్లు, రంగపేట 77 ఓట్లు, నాగునూర్ 102 ఓట్లు, కోనాపూర్ 3 ఓట్లు, లక్ష్మీదేవిపల్లి 345 ఓట్లు, అర్పపల్లి 777 ఓట్లు, బట్టపల్లి 61 ఓట్లు బీజేపీకి కంటే ఎక్కువ వచ్చాయి. కాగా బీజేపీకి లచ్చక్కపేటలో 176 ఓట్లు, పెంబట్ల 22 ఓట్లు కాంగ్రెస్ కంటే ఎక్కువ వచ్చాయి.

‘రేషన్’ దూరం.. లబ్ధిదారులకు భారం

- కిలోమీటర్ల దూరంలో రేషన్ దుకాణం
- రాంచంద్రంపేటవాసులకు తప్పని తిప్పలు
- అందుబాటులో ఏర్పాటు చేయాలని డిమాండ్



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రాంచంద్రంపేట గ్రామస్తులు

మెట్‌పల్లిరూరల్: దారిద్య్రరేఖకు దిగువన ఉన్న పేదలకు ప్రభుత్వం చౌక దుకాణాలను ఏర్పాటు చేసి రేషన్ బియ్యం అందిస్తోంది. రేషన్ బియ్యం,సరుకులు అందించే చౌక దుకాణాలు పలు చోట్ల అందుబాటులో లేకపోవడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా లబ్ధిదారులు కిలోమీటర్ల మేర దూరం వెళ్లి రేషన్ సరుకులు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మహిళలు,వృద్ధులు,యువకులు దూరభారంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

2 కి.మీల మేర దూరం..

మెట్‌పల్లి మండలం వెల్లుల అనుబంధ గ్రామం రాంచంద్రంపేటలో రేషన్ దుకాణం లేక గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు. గ్రామంలోని రేషన్ లబ్ధిదారులు 2 కి.మీల దూరంలోని వెల్లులలో ఉన్న చౌక దుకాణంలో సరుకులు తీసుకుంటున్నారు. ఒక్కోసారి రోజువారి పనులన్నీ వదులుకుని రేషన్ బియ్యం కోసం దుకాణం వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఇక్కడి వారికి ప్రతి నెల రేషన్ బియ్యం తెచ్చుకోవడం ఇబ్బందిగా మారింది. రేషన్ బియ్యం కోసం వెళ్తున్న మహిళలు, వృద్ధులు,యువకుల్లో కొందరు బియ్యం సంచులను నెత్తిన పెట్టుకుని కాలినడకన వస్తున్నారు. మరికొందరు ఆటోల్లో, ఇతర వాహనాల్లో తీసుకువస్తూ దూరభారంతో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చొరవ తీసుకోవాలని వినతి..

రేషన్ దుకాణం లేకపోవడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న రాంచంద్రంపేట గ్రామస్తులు ప్రజాప్రతినిధులకు,అధికారులకు ఎన్నోసార్లు విన్నవించారు.తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గ్రామంలో దుకాణం ఏర్పాటు చేయాలని వేడుకున్నారు. అయినప్పటికీ ఇప్పటి వరకు ఆ విషయంలో ఎలాంటి స్పందన లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా తమ గ్రామంలో రేషన్ దుకాణం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దగ్గర లేక తిప్పలు



రేషన్ దుకాణం దగ్గర లేకపోవడంతో తిప్పలు పడుతున్నాం. దూరంగా వెళ్లి బియ్యం తీసుకురావడం ఇబ్బంది అవుతోంది. అందుబాటులో రేషన్ దుకాణం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలి.

– రెబ్బాస్ బూదవ్వ,రాంచంద్రంపేట

గ్రామంలోనే ఏర్పాటు చేయాలి



మా గ్రామంలోనే రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలి. ఇక్కడ లేకపోవడంతో వెల్లుల గ్రామంలోని దుకాణానికి వెళ్లి సరుకులు తెచ్చుకుంటున్నాం.ప్రజాప్రతినిధులు స్పందించి రేషన్ షాప్ ఏర్పాటు చేయాలి.

– గడిపెల్లి రాజవ్వ,రాంచంద్రంపేట

బీజేపీ నాయకుల సంబురాలు



రాయికల్ పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

రాయికల్: నిజామాబాద్ ఎంపీగా ధర్మపురి అర్వింద్ భారీ మెజార్టీతో గెలుపొందడంతో రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని 32 గ్రామాల్లో బీజేపీ నాయకులు మంగళవారం టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ధర్మపురి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సురతాని భాగ్యలక్ష్మి, నాయకులు సింగని సతీశ్, సామల్ల సతీశ్, పట్టణ మహిళా అధ్యక్షురాలు వాసం రమ తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల/కోరుట్లరూరల్: నిజామాబాద్ ఎంపీగా ధర్మపురి అరవింద్ రెండోసారి గెలుపొందడంతో కోరుట్ల బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నిజామాబాద్‌లో డాక్టర్ రఘు సహ పలువురు నాయకులు ఎంపీ అర్వింద్‌ను కలిసి సన్మానించారు.నాయకులు గుగ్గిళ్ల తుక్కారాం గౌడ్, పంచిరి విజయ్ కుమార్, హర్షం వ్యక్తం చేశారు.

గ్రామాల్లో సంబరాలు

జగిత్యాలరూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ గెలుపొందడంతో జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల్లోని అన్ని గ్రామాల్లో బీజేపీ నాయకులు టపాసులు పేల్చి సంబరాలు నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు.

కథలాపూర్: కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ రెండోసారి గెలుపొందడంతో మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ నాయకులు మంగళవారం సాయంత్రం సంబురాలు జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో కూడళ్ల వద్ద టపాసులు కాల్చారు. ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, సత్యనారాయణ, వెంకటేశ్వర్‌రావు, వినోద్‌రెడ్డి, శివరాం, బద్రి సత్యం, గాండ్ల స్వామి, రవి, ప్రవీణ్ పాల్గొన్నారు.

పనిచేయని నిఘా నేత్రాలు..

- పట్టించుకోని పోలీస్, మున్సిపల్ అధికారులు
- రాయికల్ పట్టణంలో పెరుగుతున్న దొంగతనాలు
- గంజాయి మత్తులో యువత ఆగడాలు



చోరీ జరిగిన ఇంటిలో విచారిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో పనిచేయని సీసీ కెమెరాలు)

రాయికల్: పట్టణంలో దొంగతనాల నియంత్రణ, పోకిరీల బెడదను అరికట్టేందుకు ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ.20 లక్షల వ్యయంతో 25 కెమెరాలను ఏర్పాటు చేశారు. గత ఆరు నెలల నుంచి సీసీకెమెరాలు పనిచేయకపోవడంతో రాత్రులు, ఉదయం పూట యువకులు గంజాయి మత్తులో వేగంగా వాహనాలు నడుపుతున్నారు. అంతేకాకుండా వాహనాల దొంగలు ఎక్కువ కావడంతో సీసీకెమెరాలు పనిచేయకపోవడంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో చందాలు వేసుకుని నిఘా నేత్రాలను ఏర్పాటు చేశారు. ఒక సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని పోలీసు అధికారులు సమావేశాల్లో చెబుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం విఫలమవుతున్నారు. రాయికల్‌లో గతనెల 21న బుడిగె విజయలక్ష్మి ఇంట్లో దొంగలు చొరబడి 40 తులాల బంగారం, రూ.లక్ష నగదు తీసుకెళ్లినప్పటికీ ఇంత వరకు దొంగల ఆచూకీ కోసం పోలీసులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. పట్టణంలో సీసీకెమెరాలు ఉన్నప్పటికీ అవిపనిచేయక దొంగలను పట్టుకోవడంలో పోలీసులు విఫలమవుతున్నారు.

పట్టణంలోని 12 వార్డులు ఉండగా దొంగతనాల నియంత్రణ కోసం పట్టణంలోని గాంధీచౌక్, ఇటిక్యాల క్రాసింగ్ రోడ్, పాతబస్టాండ్, ప్రభుత్వ పాఠశాలలు, శివాజీచౌక్ వంటి ప్రధాన ఏరియాల్లో 25 సీసీకెమెరాలను ఏర్పాటు చేశారు. రెండేళ్లపాటు వాటి పనితీరు చూడాల్సిన బాధ్యత కాంట్రాక్టర్‌పై ఉంటుంది. కానీ ఆరు నెలలుగా ఐదు సీసీకెమెరాలు మాత్రమే పనిచేయడంతో ఏదైనా ప్రమాదం జరిగితే నిందితులను పట్టుకోవడం ఇబ్బందిగా ఉందని పట్టణ ప్రజలు, పోలీసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీకెమెరాలు సరిగా పనిచేయకపోవడంతో పట్టణంలో ఏ ప్రమాదం జరిగినా నియంత్రించలేక పోతున్నామని పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఎస్సై అజయ్ స్పందించి రాయికల్ పట్టణంలో సీసీకెమెరాలు పనిచేసేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సీసీకెమెరాల కోసం డబ్బులిచ్చాం



పట్టణంలో సీసీకెమెరాల ఏర్పాటు కోసం బల్దియా నుంచి నిధులు మంజూరు కాకపోతే గతంలో చందాలు వేసుకుని సీసీకెమెరాలను ఏర్పాటు చేశాం. అంతేకాకుండా మున్సిపల్ నుంచి రూ.20 లక్షలు మంజూరై సీసీకెమెరాలను ఏర్పాటు చేసి పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. రాత్రి పూట యువకులు గంజాయి సేవించి బైక్‌లపై విచ్చలవిడిగా తిరుగుతున్నారు.

– వాసం స్వామి, రాయికల్

మున్సిపల్ అధికారులపై ఒత్తిడి తెస్తున్నాం



రాయికల్ పట్టణంలోని సీసీకెమెరాలను వినియోగంలోకి తెచ్చేందుకు కాంట్రాక్టర్‌పై,మున్సిపల్ కమిషనర్‌పై ఒత్తిడి తెస్తున్నాం. మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. ప్రతి ఒక్కరూ తమ దుకాణాల వద్ద సీసీకెమెరాల ఏర్పాటు చేసుకోవాలి. పట్టణ వాసులు సీసీకెమెరాల ఏర్పాటుకు సహకరించాలి. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు అదుపు చేయవచ్చు.

– అజయ్,ఎస్సై, రాయికల్


ముగిసిన ధాన్యం కొనుగోళ్లు



ఇబ్రహీంపట్నం: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో 5 గ్రామాల్లో చేపట్టిన ధాన్యం కొనుగోళ్లు ముగిసినట్లు సహకార సంఘం చైర్మన్ బద్దం గోపి, సీఈవో మంత్రి సతీశ్ కుమార్ మంగళవారం తెలిపారు. ఇబ్రహీంపట్నం కొనుగోలు కేంద్రంలో 481 మంది రైతులకు చెందిన 20,581 క్వింటాళ్లు అమ్మక్కపేటలో 8,366 క్వింటాళ్లు, ఎర్దండిలో 9,375 క్వింటాళ్లు మూలరాంపూర్‌లో 8,119 క్వింటాళ్లు, వర్షకొండలో19,529 క్వింటాళ్లు ధాన్యం కొనుగోలు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

విద్యుత్ తీగలు సరిచేశారు..

సాక్షి స్పందన



ఇబ్రహీంపట్నం: వేలాడుతున్న విద్యుత్ తీగలను అధికారులు సరిచేశారు. మండలంలోని డబ్బా గ్రామంలో పాలేపు రమేశ్ వ్యవసాయ భూమిలో చేతికి అందేంత ఎత్తులో విద్యుత్ తీగలు ఉండడంతో దీనిపై ‘పొంచి ఉన్న ప్రమాదం’ అనే ఫోటో స్టోరీ ప్రచురితం కాగా, వెంటనే విద్యుత్ అధికారులు స్పందించిన రైతు పాలేపు రమేశ్ వ్యవసాయ భూమిలో విద్యుత్ స్తంభాలను అమర్చి ప్రమాదం జరగకుండా వైర్లను పైకి బిగించారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు



చిల్వకోడూర్‌లో సంబురాలు జరుపుకుంటున్న నాయకులు

ధర్మపురి: పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీ అత్యధిక మెజారిటీతో ఘన విజయం సాధించడంతో మంగళవారం రాత్రి కాంగ్రెస్ నాయకులు సంబరాలను ఘనంగా జరిపారు. నాయకులు స్థానిక నంది కూడలి వద్ద కేక్ కట్‌చేసి టపాసులు పేల్చి సంబరాలు జరిపారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వేముల రాజు, కుంట సుధాకర్, చీపతి సత్యనారాయణ, రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

చిల్వకోడూర్‌లో..

గొల్లపల్లి: పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీ భారీ మెజార్టీతో గెలపొందడంతో మండలంలోని చిలవ్వకోడూర్ కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచి టపాసులు పేల్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దాసరి నారాయణ, తిరుపతి,వేణు,కొంరయ్య, మజ్జు, గంగయ్య, శ్రీనివాస్, నాగయ్య,నక్క కొంరయ్య,ఏదుల గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అనుమానితుల సమాచారం ఇవ్వండి

- జగిత్యాల పట్టణ సీఐ వేణుగోపాల్



పోలీసులు విడుదల చేసిన దొంగ ఫొటో

జగిత్యాల క్రైం: జగిత్యాల పట్టణం, పరిసర ప్రాంతాల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పట్టణ సీఐ వేణుగోపాల్ కోరారు. మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంతోపాటు, పరిసర ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడే వ్యక్తి ఫొటోను విడుదల చేశారు. తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్‌గా దొంగలు చోరీలకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఫొటోలోని దొంగను గుర్తిస్తే తన ఫోన్ నంబర్ 87126 56505కు లేదా ఎస్సై నరేశ్ నంబర్ 87125 73707 కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఇసుక టిప్పర్లు, జేసీబీ పట్టివేత

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కమ్మునూర్ గ్రామ శివారుల్లో మంగళవారం అక్రమంగా గోదావరి నది నుంచి ఇసుకను తరలిస్తున్న టిప్పర్, జేసీబీని సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఏఎస్సై గజేంద్ర తెలిపారు. జగిత్యాల రూరల్ మండలం గోపాలరావుపేట గ్రామానికి చెందిన శేఖర్ అనే వ్యక్తికి చెందిన టిప్పర్, అక్రమంగా అందులో ఇసుకను నింపుతున్న ధర్మపురి మండలం తీగలధర్మారం గ్రామానికి చెందిన భాస్కర్‌కు చెందిన జేసీబీని సీజ్‌చేసి, ఈ రెండు వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

బీర్‌పూర్ మండలం గోదావరి తీరం నుంచి మంగళవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ ను స్వాధీనం చేసుకున్నట్లు హెచ్ఎస్‌వో తెలిపారు. జగిత్యాల మండలం పోలాస గ్రామానికి చెందిన టిప్పర్ యజమాని, డ్రైవర్ మధుపై కేసు నమోదు చేసినట్లు స్టేషన్‌హౌజ్ అధికారి అహ్మద్ పేర్కొన్నారు.



మిషన్ భగీరథ నీరు రోడ్ల పాలు

మేడిపల్లి: భీమారం మండల వ్యాప్తంగా చాలా గ్రామాల్లో మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు. అలాగే కొన్ని గ్రామాల్లో లీకేజీలతో నీరు వృథాగా పోతోంది. సోమవారం కమ్మరిపేటలో మిషన్ భగీరథ నీరు వృథాగా పోయి ఊరంతా చిందరవందర అయింది. అప్పట్లో ఎడాపెడా పైపులు ఏసి వదిలేశారు. సరైన ప్రణాళిక లేకుండా రోడ్లు పగలగొట్టి పైపులు వేసి, మరమ్మతులు చేయలేదు. ఎండాకాలం నీళ్లు ఇవ్వలేరు కానీ, ఇప్పుడు ఈ నీళ్లు ఎక్కడనుండి వస్తున్నాయి అని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. వృథాగా పోతున్న నీళ్ల గురించి అధికారులను అడిగే ప్రయత్నం చేయగా వారు స్పందించలేరు.

గాలివాన బీభత్సం

గొల్లపల్లి: మండలంలో మంగళవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. మండలంలోని పలు గ్రామాలో చెట్లు కూలిపోయి రోడ్డుకు అడ్డంగా పడటంతో పాటు పలు చోట్ల విద్యుత్ తీగలు తెగిపోవడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఇంకా కొన్ని చోట్ల కల్లాల్లో ఉన్న ధాన్యం తడిసి పోయింది. రాత్రి పది గంటల వరకు విద్యుత్ అంతరాయంతో ప్రజలు చీకట్లో గడిపారు.

సారంగాపూర్‌లో భారీ వర్షం

సారంగాపూర్: మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. గంటన్నర పాటు ఏకదాటిగా కురిసిన వర్షంతో వాగులు పారుతున్నాయి. పొలాల్లో నీరు చేరింది. బీర్‌పూర్ మండలంలో స్వల్పంగా వర్షం కురిసింది.

విద్యుదాఘాతంతో గేదె మృతి

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్ గ్రామ శివారులో బూస రాజారెడ్డి అనే రైతుకు చెందిన గేదె మంగళవారం విద్యుత్ షాక్‌తో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గేదె మంగళవారం గ్రామ శివారులో మేత మేస్తుండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు చెందిన వైర్లు తగలడంతో షాక్ గురై మృతి చెందింది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రక్షణగా గోడలు, కంచె ఏర్పాటు చేయకపోవడమే ప్రమాదానికి కారణమని రైతులు అంటున్నారు. రూ.65 వేలు నష్టపోయానని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: జిల్లా కేంద్రంలోని టౌన్–3 సెక్షన్ పరిధి హౌసింగ్‌బోర్డు, శ్రీనగర్‌కాలనీ, వినాయకనగర్, రామాలయం ప్రాంతం, ఎస్పీ ఆఫీస్, అంతర్గాం రోడ్, మెడికల్ కళాశాల, మాతా శిశు కేంద్రం, ఎస్సారెస్పీ చర్చి ప్రాంతాల్లో బుధవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈఈ తెలిపారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

జగిత్యాలరూరల్: మండలంలోని ఐదు గ్రామాల్లో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులపై బుధవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. ఐదు గ్రామాల్లో ఏడాదిలో చేపట్టిన పనులపై సామాజిక బృందం తనిఖీ నిర్వహించిందని, మండలస్థాయిలో బుధవారం ప్రజావేదిక ఒంటిగంటకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

7న పెగడపల్లి మండల సమావేశం

పెగడపల్లి: మండల పరిషత్ సాధారణ సమావేశం ఈ నెల 7న ఉదయం 11 గంటలకు ఎంపీపీ శోభ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సభ్యులు, వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.